కథా నిలయం
శ్రీకాకుళం

# చదరంగము

మూడుముళ్లు పడువరకును ఈ పెండ్లియగునను నమ్మకము మగపెండ్లివారికి గాని, ఆడుపెండ్లివారికి గాని లేదు. పెండ్లికొడుకు బృహస్పతి!

వేయి మొగములతో వెలికులుకు తన కొడుకు తెలివితేటలకు వియ్యంకుడు వెనుకకు పీకు నేమో యని వెనుకయ్య భీతి. కట్నముగాని కానుకగాని పెట్టి కాబోవు తన యల్లుగుణ్ణను నెవరు తెరవాటు గొట్టుదురో యని పెండ్లికూతురు తండ్రి పాపయ్యభీతి.

వియ్యంకు లిరువురకును ఇట్టి భీతితో పనిలేదు. ఏలనగా ఈ పాపయ్యకు ఆస్తిపై ఆస్థ. వెనుకయ్యకు కొనితెచ్చుకొన నక్కరలేని కోడలిపై ఆస్థ.

చీరెలమీదను, సారెలమీదను వాంఛయే కాని వధువుకు వరుని మాటయే లేదు. వాడొక కొండ ముచ్చు కాకుండిన చాలు. ఈ వరుడో చూపుల గుణ్ణము, ఇక నెందులకు భీతి? ఇసుకతక్కెడ పేడ తక్కెడ.

లగ్నము నిశ్చయము కాగానే పాపయ్య మేనల్లుని కడకు వెళ్ళెను. ఈ పెండ్లికగు వ్యయములో సగమేని మేనల్లుని కడ పుచ్చుకొనవలయు నని పాపయ్య ఆశ.

'నాయనా, మన సుందమ్మను ఉండవల్లి వెనకయ్యగారి కొడుకు శంకరయ్యకు ఇచ్చి పెండ్లిచేయ పెద్దలు నిశ్చయించిరి.' అనిపాపయ్య నీళ్లు నమలెను.

'ఏమేమీ, సుందిమెడ కుండిలో పెట్టితివా?' అని ఆ మేనల్లుడనుచుండగా దారి మారెనని పాపయ్య తెలిసికొని 'ఓయీ, నేనిచటికి నీ సలహా తీసికొనుటకు రాలేదు. లగ్నము నిశ్చతమయినదని మాత్రము చెప్పుటకు వచ్చితిని' అనెను.

'గొప్పపని చేయవచ్చితివి. చెప్పుటకు నీకు సిగ్గయినను లేదే? చెప్పితివి; కడుపు నింపితివి. చాలు నిక బొమ్ము' అని ఆ మేనల్లుడనెను.

పాపయ్య మేనల్లుని కడ అన్నమునకు బదులు సున్నము తిని అచటినుండి లేచెను. పొరుగూరు దాపుననే కలదు. అచట తనకొక మిత్రుడు కలదు. ఆకాలమున పాపయ్య అచటికి జేరెను. మిత్రు డాతిథ్యమిచ్చెను.

